క్లుప్తంగా

ఆడ పిల్లలను చదివించాలి..

బలిజిపేట: ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలని కళాజాత కళాకారులు అన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో బేటీ బచావో – బేటీ పడావో అనే అంశంపై కళాజత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడ పిల్లల చదువు ఆవశ్యకత, గుడ్/బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మావతి, పూర్ణిమ, సులేఖ, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నర్సిపురంలో గ్రాడ్యుయేషన్ డే


ఒకటో తరగతి ప్రవేశ అర్హత పత్రాలతో చిన్నారులు, ఐసీడీఎస్ సిబ్బంది

పార్వతీపురం టౌన్: మండలంలోని నర్సిపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ పీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులకు ఒకటో తరగతి అర్హత పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నర్సిపురం సెక్టార్ పర్యవేక్షకురాలు ఎస్.భాను, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమండ్రికి అదనపు బస్సులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం డిపో నుంచి రాజమండ్రికి అదనపు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కనకదుర్గ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పార్వతీపురం డిపో నుంచి విజయవాడకు అల్ట్రా డీలక్స్, రాజమండ్రికి మూడు సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మధ్య పలు రైళ్లు రద్దు కావడంతో దూర ప్రాంత ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న సర్వీసులకు అదనంగా ఉదయం 8 గంటలకు, సాయంత్రం నాలుగు గంటలకు రాజమండ్రి బస్సులు నడపుతున్నామన్నారు. పార్వతీపురం డిపో నుంచి రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వైభవంగా కోదండ రామ స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


సీతానగరం: మండలంలోని లక్ష్మీతిరుమల లచ్చయ్యపేట వద్ద గల ఎన్‌సీఎస్ కర్మాగారంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతాలక్ష్మణ సమేత కోదండ రామస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, లోక కల్యాణార్థం స్వామి కల్యాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ యాజమాన్య ప్రతినిధి ఎం. సూర్యనారాయణ, కర్మాగారం కార్మికులు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వండి


పాఠశాల పరిసరాలు పరిశీలిస్తున్న అధికారులు

సీతంపేట: విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని పీఎంఆర్‌సీ అధికారులు సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను వారు శనివారం సందర్శించారు. పాఠశాల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యార్థుల కోసం పాఠశాలను సిద్ధం చేస్తున్న తీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. మెనూ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవి, జీసీడీవో రాములమ్మ, హెచ్‌డబ్ల్యూవో అమల తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేయడంలో నిమగ్నమైన ఔత్సాహికులు

పాలకొండ రూరల్: ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా శిక్షకులు కె.జనార్దనరావు అన్నారు. స్థానిక రుషి యోగా కేంద్రంలో యోగాసనాలపై శనివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు యోగాసనాలు వేయడం నేర్పించడంతో పాటు వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏ రకమైన ఆసనం ద్వారా ఏ విధమైన ఆరోగ్యం సిద్ధిస్తుందో తెలిపారు. ప్రతిఒక్కరూ యోగా చేయాలని, యోగాతోనే ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు.

మహాకవి శ్రీశ్రీకి ఘనంగా నివాళులు


శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు


సాలూరు: శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉమామహేశ్వరి, తదితరులు

బలిజిపేట: శ్రీశ్రీ గొప్ప తెలుగు కవి అని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు తెలిపారు. పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంజీవనాయుడు మాట్లాడుతూ, గొప్ప గొప్ప కవులను స్మరించుకోవడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో పట్నాయక్, జి.సత్యం, పి.పరశురామ్, పి.భాస్కర్, జి.శ్రావణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేశాయి..

సాలూరు: అక్షరమనే ఆయుధంతో శ్రీశ్రీ తన రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచారని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం. ఉమామహేశ్వరి అన్నారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేడు సమాజంలో జరుగుతున్న అనేక దురాచారాలపై శ్రీశ్రీ తన రచనల ద్వారా పోరాటం చేశారని చెప్పారు. ప్రజలను అభ్యుదయం వైపు నడిపించడానికి ఆయన రచనలు ఎంతో దోహదపడ్డాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, శశికళ, గౌరీశ్వరి, దాలమ్మ, పార్వతి, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సర్పంచ్‌ల పర్యవేక్షణలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ కె. కుమారవర్మ తెలిపారు. మండలంలోని చినబోగిలి, తామరఖండి గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చినభోగిలిలో మాట్లాడుతూ, రాష్ట్ర రహదారిని అనుకుని ఉన్న రోడ్డుకు ఇరు వైపులా వేసిన చెత్తకుప్పలను తొలిగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పద్మావతి, మనోహర్ పాల్గొన్నారు.


చినభోగిలిలో జేసీబీ సహాయంతో చెత్త తొలగింపు

బలిజిపేటలో పారిశుధ్య పనులు

బలిజిపేట: మండల కేంద్రంలోని మెట్టవీధి, కాలనీ, తదితర ప్రాంతాల్లో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తుగా పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ బి. రాఘలత తెలిపారు. పనులను కార్యదర్శి ఆదిలక్ష్మి పర్యవేక్షించారు.

వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీ


దుక్కి పనులలో నిమగ్నమైన రైతులు

సీతానగరం: కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వరి వెదలు వేయడానికి రైతులు సన్నద్ధమయ్యారు. ఇందుకు సంబంధించి దుక్కులు చేపడుతున్నారు. ఇదిలా ఉంటే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు కొనుగోలు చేసే రైతులు మొలకశాతం పరిశీలించి తీసుకోవాలని ఏఓ అవినాష్ తెలిపారు. అలాగే విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రశీదులు భద్రపరుచుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించండి

పాలకొండ రూరల్: మూడేళ్ల వయసు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ పీవో దశారత్నం సూచించారు. మండలంలోని ఎం.సింగుపురం గ్రామంలో పిల్లల తల్లులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, పౌష్టికాహారం వంటి సదుపాయాలపై అవగాహన కల్పించారు. కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనందించడంతో పాటు ప్రతీ పిల్లవాడి సంపూర్ణ ఆరోగ్యానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కేంద్రాల్లో ఉండి, ఐదేళ్ల వయసు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలి


వేతనదారులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

కురుపాం: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని గుమ్మిడిగూడ, సంగెడ్డ గిరిజన గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు శనివారం ఆయన వెళ్లి, వేతనదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం చెల్లించాలని, రోజుకు ఒక్కపూట మాత్రమే పని ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కూడా కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..


వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

● మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామంలో ఉన్న తన స్వగృహంలో పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం సమావేశమై, దిశానిర్దేశం చేశారు. పార్టీ అధికారంలోకి రాలేదని, ఎవరూ నిరాశ చెందవద్దని, ప్రజాతీర్పును గౌరవించాలని తెలిపారు. కూటమి నేతల బెదిరింపులకు అస్సలు భయపడవద్దని, పార్టీ పరంగా అందరికీ అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, తనకు గెలుపు, ఓటమి కొత్తేమీ కాదన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తానన్నారు. రానున్న రోజుల్లో మరింత ప్రజాదరణ పొందేలా నడుచుకుంటానన్నారు. అందరికీ అందుబాటులో ఉండి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి మనమంతా పాటుపడాలన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీపై డిప్యూటీ ఈవో ఆరా

పాలకొండ రూరల్: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఈవో పి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన.. ఎంఈవోలకు పలు సూచనలు చేశారు. డ్రాపౌట్లు లేకుండా చూడాలని, బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్టూడెంట్ కిట్లు పంపిణీపై ఆరాతీయగా, ఎంఈవో కె.సోంబాబు స్పందించి, ఇప్పటివరకు పాఠశాలలకు సరఫరా అయిన కిట్లు వివరాలను తెలిపారు. మండలంలో మొత్తం 59 ప్రభుత్వ పాఠశాలల్లో 4,533 మంది విద్యార్థులు ఉండగా, వారిలో 1, 2 తరగతుల విద్యార్థులకు 660, 3, 4, 5 తరగతులకు సంబంధించి విద్యార్థులకు 1,360, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న విద్యార్థులకు సంబంధించి, 2,513 స్కూల్ బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే 4,515 బూట్లు, 9,030 సాక్సులు, 3,229 బెల్టులు, 736 డిక్షనరీలు, 13,599 యూనిఫాం, 25,846 నోటు పుస్తకాలు, 23,572 పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు కిట్లు సరఫరా చేస్తున్నామన్నారు.


పాఠశాలలకు పంపిస్తున్న పుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో కృష్ణమూర్తి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు


దేరువాడలో దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న డీఎంవో జగన్‌మోహన్‌రావు

● జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

గుమ్మలక్ష్మీపురం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా మలేరియా నివారణ అధికారి(డీఎంవో) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని దేరువాడ గ్రామంలో శనివారం నిర్వహించిన దోమల నివారణ మందు పిచికారీని ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. ప్రధానంగా మురుగునీటి నిల్వలు, చెత్తాచెదారం ఉన్నచోట దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని, వీటి కారణంగా మలేరియా, డెంగీ జ్వరాలు వస్తాయన్నారు. వీటి బారిన ప్రజలు పడకుండా ప్రతీ గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ పనులను ముమ్మరం చేశామన్నారు. కాలువలు, మురుగునీటి నిల్వల ప్రాంతాలు, ఇళ్ల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నామన్నారు. ప్రస్తుతం మొదటి విడత పనులు జరుగుతున్నాయని, వచ్చే నెలలో రెండో విడత పనులు జరుగుతాయన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే తప్పనిసరిగా పాటించి, ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతీ గ్రామంలో ఫీవర్ సర్వేతో పాటు పారిశుద్ధ్య పనులు, తాగునీటి బోర్లు, బావుల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం దుడ్డుఖల్లు పీహెచ్‌సీని ఆయన సందర్శించి, అక్కడి ల్యాబ్‌లో నిర్వహిస్తున్న జ్వరనిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. రోజుకు ఎన్ని శాంపిల్స్ వస్తున్నాయి.. ఎంతమందిలో జ్వర నిర్ధారణ ఖరారవుతోందన్న విషయాలపై ఆరాతీశారు. ఆయన వెంట వైద్యాధికారి బి.స్వాతి, సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు, సూపర్‌వైజర్లు జయగౌడ్, పెంటమ్మ తదితరులు ఉన్నారు.

వయోవృద్ధులకు అండగా నిలవాలి

● సీనియర్ న్యాయవాది జోగారావు


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది జోగారావు

పార్వతీపురం టౌన్: వయోవృద్ధులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సీనియర్ న్యాయవాది జోగారావు అన్నారు. బెలగాంలో ఐఆర్‌పీడబ్ల్యూఏ, రెడ్ క్రాస్ సొసైటీ, హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, వయోవృద్ధుల బాగోగులను పిల్లలు సరిగా చూసుకోవాలని సూచించారు. వయోవృద్ధులకు ఎటువంటి సమస్యలు వచ్చిన అండగా ఉంటామని.. ఆస్తుల గొడవలు ఉంటే స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సంప్రదిస్తే సహకారం అందిస్తామని చెప్పారు. చట్టాల కంటే ప్రేమానురాగాలతో చాలా సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. అనంతరం నిరాశ్రయులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడంతో పాలువురిని సన్మానించారు. కార్యక్రమంలో బెలగం జయప్రకాష్, ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు, రెడ్‌క్రాస్ చైర్మన్ శ్రీరాములు, ఐఆర్‌పీడబ్ల్యూఏ సంస్థ డైరెక్టర్ ప్రకాష్, అప్పలరాజు, పెన్షన్ భవన్ సభ్యులు, సీతం ఇంజినీరింగ్ కాలేజ్ స్టూడెంట్స్, సిబ్బంది గణేష్ జానీ, పెన్షనర్లు, సభ్యులు ఊర్మిళ ,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నంబూద్రిపాద్ ఉద్యమాల వీరుడు


కామ్రేడ్ ఈఎంఎస్ నంబూద్రిపాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

● సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: ఈఎంఎస్ నంబూద్రిపాద్ ఉద్యమాల వీరుడని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యమ్మల మన్మథరావు, జిల్లా కమిటీ సభ్యుడు జి. వెంకటరమణ అన్నారు. ఈఎంఎస్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నంబూద్రిపాద్ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్)వ్యవస్థాపక నాయకులలో ఒకరన్నారు. దాదాపు ఏడు దశాబ్దాల ప్రజా జీవితంలో దేశ ప్రగతిశీల, శ్రామిక ఉద్యమంపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు. యువకుడిగా ఉన్నప్పుడే అనేక పోరాటాలు చేశారని, 1931లో కాలేజీని వదిలి స్వాతంత్ర్య పోరాటంలో చేరారని తెలిపారు. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారన్నారు. కేరళలో శక్తివంతమైన కమ్యూనిస్ట్ ఉద్యమ అభివృద్ధికి పునాదులు వేశారని తెలిపారు. సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు ఆయన ప్రాతినిథ్యం వహించారన్నారు. సంప్రదాయ భూస్వామి కుటుంబం నుంచి వచ్చిన ఆయన కమ్యూనిస్ట్ నాయకుడిగా ఎదిగి 1967లో కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.సూరిబాబు, పడాల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 117ను రద్దు చేయాలి

గరుగుబిల్లి: జీవో నంబర్ 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎ.మహేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఖడ్గవలస గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ మండల సబ్‌కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీనం అంశం వెనక్కి తీసుకోవాలని కోరారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యాబోధన తెలుగు మాధ్యమంలో, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు, ఆంగ్లం మాధ్యమాల్లో విద్యాబోధన ఉండేలా మార్పులు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.తిరుపతిరావు, రమణ, వి.శ్రీనివాసరావు, డి.రమేష్, ఎస్.మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎ.మహేశ్వరరావు

గొడౌన్‌లలో ఆకస్మిక తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గొడౌన్‌లలో జీసీసీ విజిలెన్స్ అధికారి ఎం.వి.వి.ఎస్.ఉమాదేవి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మెయిన్ గొడౌన్ (స్టాక్ పాయింట్), డీఆర్‌ఎస్ గొడౌన్, గ్యాస్ గొడౌన్‌లలో సరుకు నిల్వలు, వాటి రికార్డులను పరిశీలించి, రికార్డుల్లో పేర్కొన్న విధంగా నిల్వలు ఉన్నవీ లేనవీ చూశారు. వార్షిక తనిఖీల్లో భాగంగానే ఈ తనిఖీలు చేశామని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట జీసీఎంఎస్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి, డీఆర్‌ఎస్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు, తదితరులు ఉన్నారు.


డీఆర్‌ఎస్ గొడౌన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జీసీసీ విజిలెన్స్ అధికారి ఉమాదేవి

స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి

కురుపాం: స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించి, గిరిజన ప్రాంతాల్లోని నిరుద్యోగులను ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, గౌరవాధ్యక్షుడు మండంగి రమణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విలేకరుల తో వారు శనివారం మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభు త్వం ప్రకటించిన డీఎస్సీని స్వాగతిస్తున్నామని, ఇదే సమయంలో స్పెషల్ డీఎస్సీ కూడా ఇచ్చి, జీవో నంబర్ 3ను కూడా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని, భాషా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వారి వెంట గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగునాయుడు తదితరులు ఉన్నారు.

39 వేల పోస్టులు ఖాళీ..

సీతంపేట: ఏజెన్సీ ప్రాంతాల్లోని నిరుద్యోగ గిరిజనులకు మేలు చేకూరేలా స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోలక అవినాష్, మండంగి లక్ష్మణరావులు ఓ ప్రకటనలో శనివారం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 39 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కేవలం 16,347 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి, చేతులు దులిపేసుకోవడం సరికాదన్నారు. జీవో నంబర్ 3ను పునరుద్ధరించి, ఐటీ డీఏ పరిధిలోని ఖాళీ పోస్టుల భర్తీకి కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి, ప్రజలను న్యాయం చేయాలన్నారు.